
పెంట్లవెల్లిలోని పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేసేందుకు బారులుదీరిన మహిళలు


పెంట్లవెల్లి : కొండూరులో ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రం వద్ద బారులుదీరిన ఓటర్లు

# ఉద్రిక్తత మధ్య పోలింగ్

- సాతాపూర్‌లో కత్తితో కాంగ్రెస్ నేత దాడి
- పెద్దకొత్తపల్లి పోలింగ్ కేంద్రం వద్ద బాహాబాహీ
- రాత్రి 8గంటల వరకు కొనసాగిన పోలింగ్
- నార్లాపూర్ కేంద్రంలో ఎన్నికల సిబ్బందితో ఓటర్ల గొడవ

కొల్లాపూర్, నవంబర్ 30: కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో గురువారం జరిగిన ఎన్నికల పోలింగ్ రాత్రి 8గంటల వరకు కొరకు కొనసాగింది. అక్కడక్కడ చెదురుమదురు ఘటనలతో పాటు బీఆర్ఎస్‌కు చెందిన ఇద్దరి నాయకులలో ఒకరిపై కత్తి దాడి, మరొకరిపై కాంగ్రెస్ నాయకులు దాడులకు పాల్పడ్డారు. దీంతో కొన్ని గ్రామాల్లో స్వల్ప ఉద్రిక్తతలు నెలకొన్నాయి. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లకు 2,34,167 మంది ఓటర్లు ఉన్నారు. గురువారం సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ 69.84శాతం నమోదైంది. ఇదిలా ఉండగా ఉదయం 7గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులుతీరారు. వ్యవసాయ పొలం పనులకు వెళ్లేందు కోసం ఉదయమే మహిళలు ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. జూపల్లి కృష్ణారావు దంపతులు పట్టణంలోని బాలికల హైస్కూల్‌లో, పెద్దకొత్తపల్లి మండలం మహాసముద్రంలో బీజేపీ అభ్యర్థి ఎల్లేని సుధాకర్‌రావు దంపతులు, అదే మండలం మరికల్‌లో శిరీష అలియాస్ బర్రెలక్క తమ ఓటును వినియోగించుకున్నారు. కొల్లాపూర్ మండలం ఎన్మన్‌బెట్ల, సింగవట్నం, ఎల్లూరు, పెంట్లవెల్లి మండల కేంద్రంలో రాత్రి 7:30గంటల వరకు పోలింగ్ పోలీసుల పహారాలో కొనసాగింది. నియోజకవర్గంలోని పెద్దకొత్తపల్లి మండలం సాతాపూర్‌లో బుధవారం రాత్రి తమ కార్యకర్తల ఇంటికి వెళ్లి వస్తున్న బీఆర్ఎస్ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుజ్జుల పరమేశ్‌పై అదే గ్రామానికి చెందిన ఇద్దరు కాంగ్రెస్ వర్గీయులు కత్తితో దాడి చేశారు. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు స్వల్ప లాఠీచార్జీ చేసి చెదరగొట్టారు. ఒకానొక దశలో పోలీసు వాహనంపై కాంగ్రెస్ వర్గీయులు రాళ్లు రువ్వారని తెలిసింది. ఇదే మండలం చిన్నకార్పాములలో బీఆర్ఎస్ నాయకుడు మురళీధర్‌రెడ్డిపై పోలింగ్ కేంద్రం సమీపంలో కాంగ్రెస్ నాయకుడు, నాయినేనిపల్లి మైసమ్మ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్‌పై దాడికి పాల్పడాడ్డు. బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతుగా పనిచేయడాన్ని జీర్ణించుకోలేక దాడికి పాల్పడినట్లు మురళీధర్ రెడ్డి వాపోయాడు. మధ్యాహ్నం 2గంటల తర్వాత పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని 19, 20 పోలింగ్ కేంద్రాలకు పరిశీలించేందుకు కాంగ్రెస్ అభ్యర్థి జూపల్లి కృష్ణారావు తన అనుచరులతో రావడాన్ని బీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో రెండువర్గాలు బాహాబాహీకి దిగారు. స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకోవడంతో పోలీసుల జోక్యంతో అక్కడి నుంచి బయటికి పంపారు. పెద్దకొత్తపల్లిలోని బాచారం గ్రామం కొత్తగా గ్రామపంచాయతీ కావడంతో అక్కడ కేంద్రం ఏర్పాటు చేశారు. పెద్దకొత్తపల్లికి చెందిన 20మంది ఓటర్ల పేర్లు బాచారం ఓటరు జాబితాలో ఉండడంతో సదరు ఓటర్లు ఖంగుతిన్నారు. తమ గ్రామంలోని ఓటరుజాబితాలో పేర్లు లేకుండగా చేయడాన్ని అధికారుల నిర్లక్ష్యాన్ని వారు తులనాడారు. కొల్లాపూర్ మండలం మొలచింతపల్లిలో ఉదయం 11గంటల సమయంలో పోలింగ్ కేంద్రం వద్ద ఎండలో ఓటు వేసేందుకు క్యూలైన్లో భారీగా ఉన్న మహిళలు తోసుకున్నారు. ఇదే పోలింగ్ కేంద్రంలో ఎల్లమ్మ పేరు మీద ఉన్న ఓటును మరో ఎల్లమ్మ వచ్చి ఓటు వేయడంతో గొడవ జరిగింది. పోలీసులు గొడవను సద్దుమణిగించారు. నార్లాపూర్ పోలింగ్ కేంద్రంలో మధ్యాహ్నం 2:30గంటల సమయంలో మద్యం తాగివచ్చిన వలస ఓటర్లు క్యూలో నిలబడలేక పోలింగ్‌కేంద్రంలో ఎన్నికల సిబ్బందితో గొడవకు దిగారు. దీంతో పోలీసుల జోక్యంతో సద్దుమణిగింది. కోడేరు మండలం మాచుపల్లి పోలింగ్ కేంద్రంలో చాలాసేపు కాంగ్రెస్ అభ్యర్థి జూపల్లి తిష్టవేసి కూర్చోవడాన్ని వివిధ పార్టీల నాయకులు ఆక్షేపించారు. పాన్‌గల్, వీపనగండ్ల, కోడేరు, చిన్నంబావి, పెంట్లవెల్లి మండలాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సీఐ యాలాద్రి, ఎస్సైలు పర్యవేక్షణలో సిబ్బంది పహారాలో ఉన్నారు.

## చిన్నంబావిలో ప్రశాంతం

చిన్నంబావి, నవంబర్ 30: మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని ఎన్నికల అధికారి, తాసీల్దార్ ఎం.డి ఇక్బాల్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటలకు పోలింగ్ నిర్వహించారు.


కొల్లాపూర్: ఎల్లూరు పోలింగ్ కేంద్రంలో సహాయకులతో ట్రైసైకిల్ పై వచ్చి ఓటు వేసి వెళ్తున్న 90 ఏళ్ల వృద్ధురాలు


పెంట్లవెల్లిలో ఓటు హక్కును వినియోగించుకొని సిరా గుర్తును చూపుతున్న వృద్ధురాలు


వీపనగండ్లలో ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ రాందాస్ తేజ

## పోలింగ్‌కేంద్రం పరిశీలన

వీపనగండ్ల, నవంబర్ 30: పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా గట్టి బందోబస్తు నిర్వహించాలని అడిషనల్ ఎస్పీ రాందాస్‌తేజ పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. పోలింగ్ కేంద్రాల ఆవరణలో పరిస్థితులను పరిశీలించారు. జిల్లాలో మొత్తం 400 మంది సీఆర్‌పీఎఫ్ పోలీస్ సిబ్బందితో పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు నిర్వహించామన్నారు. సమస్యాత్మక గ్రామాలను గుర్తించి పకడ్బందీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ రవిప్రకాశ్, ఏఎస్ఐ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చిన్నంబావి: బెక్కెంలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు క్యూలో ఓటర్లు


చిన్నంబావి : గూడెంలో బందోబస్త్ మధ్య పోలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం


కొల్లాపూర్: ఎల్లూరులో పోలింగ్ కేంద్రం వద్ద బారులుదీరిన ఓటర్లు


పెంట్లవెల్లి: జటప్రోల్ లో ఓటు వేసేందుకు వీల్ చైర్‌లో తరలిస్తున్న అంగన్‌వాడీ టీచర్